# ప్రభుత్వ దవాఖానలకు సుస్తీ



కామారెడ్డి ఏరియా దవాఖానలో ఓపీ రోగుల అవస్థలు

- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే దుస్థితి
- విజృంభిస్తున్న విష జ్వరాలు
- పేదలకు అందని మెరుగైన వైద్యం
- బెడ్లు లేక అవస్థలు..

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 13: సర్కార్ వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారింది. రాష్ట్రంలోని ఏ దవాఖాన చూసిన ఏమున్నది గర్వకారణం అన్నట్టు ఉన్నది. వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ఉన్న వైద్యులు, సిబ్బంది సైతం సమయ పాలన పాటించక పోవడంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. యంత్రాలు పనిచేయక పేదలకు సరైన సేవలు అందడం లేదు. ఇన్‌పేషంట్లు పెరుగుతున్నా అందుకు అనుగుణంగా బెడ్లు లేకపోవడంతో ఒకే బెడ్డుపై ఇద్దరికి వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొన్నది. నిర్వహణ సరిగా లేక దవాఖానల్లోని మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. ఆవరణల్లో సైతం ఎక్కడి చెత్త అక్కడే అన్నట్టుగా ఉన్నది. ఉత్తర తెలంగాణ ప్రజలకు గుండెకాయ వంటి వరంగల్ ఎంజీఎం దవాఖానను సమస్యల జబ్బు వెంటాడుతున్నది. వైద్యులు, సిబ్బంది, యంత్రాలు అందుబాటులో ఉన్నా నిర్దేశిత టెస్ట్‌లు జరగటం లేదు. మందులు, ఇంజక్షన్లు, వీల్‌చైర్లు, ట్రాలీల కొరత ఉన్నది. కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యవసర సేవలు కలగానే మిగిలాయి. మానుకోట జిల్లాలో సగటున ప్రతి నాలుగిండ్లకు ఒక జ్వర బాధితుడు ఉన్నాడంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన గంగారం, కొత్తగూడ, బయ్యారం, గార్ల ఏజెన్సీ మండలాల్లో ఇంటికో జ్వర బాధితుడు ఉన్నాడు. ఆదిలాబాద్ రిమ్స్‌లో నర్సుల కొరత ప్రధాన సమస్యగా మారింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్ర దవాఖానలో అధునాతన సీటీ స్కానింగ్ యంత్రం వచ్చి నెలలు గడుస్తున్నా టెక్నీషియన్ లేక సేవలు ప్రారంభించలేదు. జనగామ జిల్లా దవాఖానలో కడుపునొప్పితో వెళ్తే డాక్టర్లు స్కానింగ్ కోసం బయటకు పంపుతున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానల్లో వైద్య సేవలు అధ్వానంగా మారాయి. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నది.



సూర్యాపేట జిల్లా కేంద్ర దవాఖానలో ఒక్కో బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స

## గ్రూప్-1 మెయిన్‌కు సర్వం సిద్ధం!

- అక్టోబర్ 21 నుంచి 27 వరకు పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్ పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ సర్వం సిద్ధం చేస్తుంది. వివిధ ప్రభుత్వ శాఖలోని 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి జూన్ 9న ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించింది. జూలై మొదటి వారంలో 1:50 నిష్పత్తి ప్రకారం 32 వేల మంది అభ్యర్థులను మెయిన్‌కు ఎంపిక చేసింది. అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్ పరీక్షలు నిర్వహించనున్నది. 32 వేల మందికి పరీక్షలు నిర్వహించడానికి ప్రశ్నాపత్రాల రూపకల్పన, ఆన్సర్ షీట్ల తయారీలో అధికారులు నిమగ్నమయ్యారు. పరీక్షలను జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్వహించే అవకాశాలున్నాయి. ఓ వర్గానికి చెందిన నిరుద్యోగులు మాత్రం జీవో 29, ఇతర అంశాలపై న్యాయపోరాటాలు చేయనున్నట్టు తెలిసింది.

## డీఎస్సీ 'కీ' విడుదల

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్షల ప్రాథమిక కీతో పాటు రెస్పాన్స్‌షీట్లను అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 20లోగా అభ్యంతరాలు తెలపాలని సూచించారు. ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్ల కోసం https:// tgdsc. aptonline. in/tgdsc వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఎండీఎస్ కన్వీనర్ కోటా భర్తీకి వెబ్ ఆప్షన్స్

వరంగల్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఎండీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీ మొదటి విడత వెబ్ ఆప్షన్స్ ఈ నెల 13న మధ్యాహ్నం 3 నుంచి 15వ తేదీ మధ్యాహ్నం 3 వరకు నమోదు చేసుకోవాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ (http:// knruhs.telangana.gov.in) సందర్శించాలని వారు సూచించారు.

## 16న యూఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): అమెరికా చదువుల సమాచారాన్ని అందించేందుకు అమెరికా ఎడ్యుకేషన్ ఫెయిర్ మాదాపూర్ ఐటీసీ కోహినూర్‌లో 16న సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9:30 వరకు నిర్వహించనున్నారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో యూజీ, పీజీ, డాక్టరేట్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చని హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ వర్గాలు వెల్లడించాయి. యూఎస్‌లోని 80 అక్రిడిటేడ్ వర్సిటీలు, కాలేజీల ప్రతినిధులు హాజరవుతారని, 17న చెన్నై, 18న బెంగళూరు, 19న కోల్‌కతా, 21న అహ్మదాబాద్, 22న పూణే, 24న ముంబై, 25న ఢిల్లీల్లో ఎడ్యుకేషన్ ఫెయిర్ జరుగతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం https:// bit.ly/EdUSAFair24Emb లింకును సంప్రదించాలని సూచించారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్

- 2032 నాటికి 27వేల మెగావాట్లకు పీక్ డిమాండ్
- ప్రతి ఏటా 6% పెరుగుతున్న విత్యుత్తు అవసరాలు
- రోజువారీ వినియోగం 1.20 లక్షల మిలియన్ యూనిట్లకు చేరవచ్చు
- సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనా



**భవిష్యత్తు డిమాండ్ ఇలా..**

| సంవత్సరం | భవిష్యత్తు డిమాండ్ అంచనా (మిలియన్ యూనిట్లు) | పెరుగుదల శాతం | పీక్ డిమాండ్ అంచనా (మెగావాట్లు) | పెరుగుదల శాతం |
|---|---|---|---|---|
| 2023-24 | 77,053 | 0000 | 15,704 | 0000 |
| 2024-25 | 82,316 | 6.21% | 16,877 | 7.47% |
| 2025-26 | 87,414 | 6.19% | 18,138 | 7.47% |
| 2026-27 | 92,967 | 6.35% | 19,529 | 7.67% |
| 2027- 28 | 98,578 | 6.04% | 20,968 | 7.37% |
| 2028-29 | 1,0,4383 | 5.89% | 22,488 | 7.25% |
| 2029-30 | 1,10,971 | 6.31% | 24,215 | 7.68% |
| 2030-31 | 1,15,862 | 4.41% | 25,639 | 5.88% |
| 2031-32 | 1,20,549 | 4.05% | 27,059 | 5.54% |

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): కొత్త జిల్లాల ఏర్పాటు.. అభివృద్ధి విస్తరణ, పారిశ్రామికీకరణ వేగవంతం కావడంతో రాష్ట్రంలో ఏటా విద్యుత్తుకు డిమాండ్ పెరుగుతున్నది. భవిష్యత్తులోను సాలీనా ఆరు శాతం విద్యుత్తు డిమాండ్ పెరగనుంది. 2032 నాటికి రాష్ట్రంలో విద్యుత్తు పీక్ డిమాండ్ 27 వేల మెగావాట్లకు చేరుతుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనా వేసింది. 2023 -24లో పీక్ డిమాండ్ 15,704 మెగావాట్లుండగా, ఈ ఏడాది అది 16,877 మెగావాట్లకు చేరుతుందని సంస్థ అంచనా వేసింది. ఈ మేరకు మంగళవారం రిపోర్ట్ ఆన్ రిసోర్స్ అడిక్వసీ ప్లాన్ ఫర్ తెలంగాణ-2031-32 పేరుతో ఓ నివేదికను విడుదల చేసింది. రాష్ట్రంలో విద్యుత్తు అవసరాలు రానురాను పెరుగుతాయని, ఈ మేరకు రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని సంస్థ సూచించింది. విద్యుత్తు డిమాండ్ తీవ్రంకానున్న నేపథ్యంలో కరెంట్ ఉత్పత్తిని రెట్టింపు చేయాల్సి ఉంది. దీనిని ముందుగా గమనించిన గత కేసీఆర్ ప్రభుత్వం నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం గల యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను చేపట్టింది. గతంలోనే భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను అత్యంత వేగంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. అంతేకాకుండా సౌర విద్యుత్తు వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించింది.

### సౌర విద్యుత్తుకు ప్రోత్సాహం

ప్రస్తుతానికి రాష్ట్రంలో స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 15,751 మెగావాట్లుగా ఉంది. దీంట్లో 7,558 మెగావాట్లు (48శాతం) థర్మల్ విద్యుత్తు కాగా, 2,448 మెగావాట్లు (15.5%) జల విద్యుత్తు. ఇక సోలార్ 5,228 మెగావాట్లు (33.2%) న్యూక్లియర్ 216 మెగావాట్లు (1.4%) బయోమాస్ 173 మెగావాట్లు (1.1%), విండ్ 128 (0.8%)గా ఉంది.

- రాష్ట్రంలో ప్రస్తుతం రోజువారీ వినియోగం 82 వేల మిలియన్ యూనిట్లు ఉండగా, ఇది రాబోయే రోజుల్లో లక్ష మిలియన్ యూనిట్లకు చేరనున్నది. 2031 -32కు వచ్చేసరికి ఇది. 1.20 లక్షల మిలియన్ యూనిట్లకు చేరనుంది.
- 2023 -24 నుంచి 2029 -30 వరకు ఏటా విద్యుత్తు డిమాండ్ 6 శాతం పెరగనుండగా, ఆ తర్వాత 4 శాతానికి తగ్గనుంది. ఇక పీక్ డిమాండ్ ఏటా 7శాతం పెరిగి, ఆ తర్వాత 6 శాతానికి చేరనుందని సీఈఏ అంచనావేసింది.
- రాష్ట్రంలో అత్యధిక డిమాండ్ డిసెంబర్ మాసం నుంచే మొదలవుతున్నది. 2022-23 సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చి మాసాల్లో 14వేల మెగావాట్లకు తాకగా, ఏప్రిల్లో 12వేల మెగావాట్లకు చేరింది.
- రోజులో పగలు, రాత్రి విద్యుత్తు డిమాండ్ సరళిని పరిశీలిస్తే రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు నమోదుకాగా, మధ్యాహ్నం పూట దాదాపు ఎలాంటి మార్పులు లేవు.
- విద్యుత్తు డిమాండ్‌ను అధిగమించాలంటే విండ్, హైడల్ విద్యుత్తు, పునరుత్పాదక ఇంధనం ఉత్పత్తిని పెంచాలి. 2023-24లో వీటి ద్వారా 19,228 మిలియన్ యూనిట్లు అందగా, దీనిని 37,253 మిలియన్ యూనిట్లకు పెంచాలని సీఈఏ అంచనావేసింది.

# ఐఐటీహెచ్‌కు నిర్ఫ్‌లో 12వ ర్యాంకు

### ఆవిష్కరణల్లో 3వ, పరిశోధనల్లో 15వ ర్యాంకు



సంగారెడ్డి, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ నిర్ఫ్‌లో 12వ ర్యాంకు సాధించి మెరిసింది. గత రెండేండ్లలో ఐఐటీహెచ్ నిర్ఫ్ ర్యాంకింగ్ 14 ఉండగా ఈ ఏడాది 12వ ర్యాంకు వచ్చింది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(నిర్ఫ్) ఏటా దేశంలోని విశ్వ విద్యాలయాలు, సాంకేతిక విద్యాసంస్థలు, ఇంజనీరింగ్ కళాశాలలు, పరిశోధనల సంస్థల విద్యాబోధన, పనితీరు, పరిశోధనలు, ఫలితాలు తదితర అంశాలను మదించి ర్యాంకులను కేటాయిస్తుంది. 2024కు నిర్ఫ్ సోమవారం ర్యాంకులను ప్రకటించింది. ఈ ర్యాంకుల్లో ఐఐటీహెచ్ మెరిసింది. ఓవరాల్ ర్యాంకింగ్‌లో ఐఐటీహెచ్ 12వ ర్యాంకు సాధించింది. 2022, 2023లో ఓవరాల్ ర్యాంకింగ్‌లో ఐఐటీహెచ్ 14వ స్థానంలో నిలిచింది. నిర్ఫ్ ఆవిష్కరణల క్యాటగిరీల్లో ఐఐటీహెచ్ 3వ ర్యాంకు, నూతన ఆవిష్కరణల్లో మొదటి స్థానంలో ఉండగా తాజా నిర్ఫ్ ర్యాంకింగ్‌లో మూడవ స్థానంలో నిలిచింది. దేశంలోని టాప్ 50 పరిశోధన సంస్థల్లో ఐఐటీహెచ్‌కు 15వ ర్యాంకు వచ్చింది. దేశంలోని 100 ప్రసిద్ధ ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా ఐఐటీహెచ్‌కు 8వ ర్యాంకు వచ్చింది.

# మేనేజ్‌మెంట్ సీట్లకు రెక్కలు

- సీట్ల కన్వర్షన్‌కు అనుమతినివ్వని సర్కార్
- మేనేజ్‌మెంట్ సీట్ల కోసం వెతుకులాట
- 15లక్షలకు వరకు కాలేజీల డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): బీటెక్ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం రగడ తారాస్థాయికి చేరింది. బీటెక్‌లో 9వేల సీట్ల కన్వర్షన్‌కు 90 కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇవన్నీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్(సీఎస్‌ఈ) కోర్సుకు సంబంధించినవే. ఈఈఈ, సివిల్, మెకానికల్ కోర్సుల్లో సీట్లను తగ్గించుకుని, సీఎస్‌ఈలో పెంచుకునేందుకు సిద్ధపడ్డాయి. ఇందుకు జేఎన్టీయూ ఎన్వోసీ ఇవ్వగా, ఏఐసీటీఈ ఆమోదం తెలిపింది. సీట్ల కన్వర్షన్‌కు ప్రభుత్వం నో చెప్పడంతో పరిస్థితి డోలాయమానంలో పడింది. ఏఐసీటీఈ లెక్కల్లో ఈ సీట్లు సీఎస్‌ఈకి మారినట్టు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు అనుమతినివ్వకపోవడంతో వాటికి గండిపడింది. ఈ సీట్లల్లో 30 శాతం యాజమాన్యకోటాలో భర్తీ చేసుకునే అవకాశం ఉండటంతో కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అడ్వాన్స్ స్వీకరించాయి. ఆఖరున సర్కారు సీట్ల కన్వర్షన్‌కు అనుమతినివ్వకపోవడంతో మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు గండిపడింది. దీంతో అడ్వాన్స్ తీసుకున్న వారికి సీట్లు కేటాయించని పరిస్థితి నెలకొన్నది. ఫలితంగా కొన్ని కాలేజీలు సీటు ధరను పెంచాయి. పేరుమోసిన కాలేజీల్లో సీఎస్‌ఈ సీటు రూ. 20 లక్షలు, మరికొన్ని కాలేజీల్లో రూ.15 లక్షలకు చేరింది. ఇబ్రహీంపట్నం సమీపంలో ఓ కాలేజీలో ముందు ఒక ఫీజు చెప్పి ఆ తర్వాత రూ.14 లక్షలు చెప్పడంతో తల్లిదండ్రులు సీటు వదులుకున్నారు. దుండిగల్‌లోని ఓ కాలేజీలో తల్లిదండ్రులు యజమాన్యంతో గొడవకు దిగారు. కాలేజీల యాజమాన్యాలకు అనుకూలంగా మంగళవారం హైకోర్టులో తీర్పురావడం కాస్త ఉపశమనంగా చెప్పవచ్చు.

## 25 ఇసుక రీచ్‌లకు ఎన్జీటీ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్(ఎన్జీటీ) ఆదేశాలతో కొంతకాలం క్రితం మూతపడిన 25 ఇసుక రీచ్‌లకు మోక్షం లభించింది. మంగళవారం ఎన్జీటీలో జరిగిన విచారణ సందర్భంగా ఈ రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతిస్తూ ట్రిబ్యూనల్ తీర్పు వెలువరించినట్టు అధికారులు తెలిపారు. పర్యావరణానికి హాని చేకూరుతుందనే కారణంతో కొంతకాలం క్రితం గోదావరి నదీ పరివాహకంలో కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలోని 25 ఇసుక రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలను ఎన్జీటీ నిషేధించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 76 రీచ్‌లకుగాను 19 రీచ్‌లలో మాత్రమే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. తాజాగా ఎన్జీటీ అనుమతితో మరో 25రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. అయితే నదిలో నీటి ప్రవాహం కారణంగా ఈ 25 రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు కొంత సమయం పడుతుందని వారు తెలిపారు. ఇటీవల టెండర్లు ఖరారైన మేడిగడ్డ ప్రాజెక్టులోనూ నీటి ప్రవాహం కారణంగా ఇసుక తవ్వకాలు ఇంకా ప్రారంభం కాలేదు.

## వాట్సాప్ ద్వారా ఇసుక బుకింగ్!

**టీజీఎండీసీ సన్నాహాలు.. అక్రమాల అడ్డుకట్టకు ఇసుకరీచ్‌ల వద్ద డ్రోన్లతో నిఘా**



హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఇసుక సరఫరాలో అక్రమాలపై టీజీఎండీసీ దిద్దుబాటు చర్యలకు దిగింది. వాట్సాప్ ద్వారా ఇసుక బుకింగ్ చేసుకునేలా కొత్త సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇసుక సరఫరాలో అక్రమాలను అరికట్టేందుకు రీచ్‌లు, స్టాక్‌యార్డ్‌ల వద్ద డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయాలని, లారీలకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిశ్చయించింది. ఇసుక సరఫరాలో అక్రమాలపై ఇటీవల లారీ యజమానులు టీజీఎండీసీ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఇసుక సరఫరాలో అక్రమాలను సమూలంగా నిర్మూలించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని టీజీఎండీసీ నిర్ణయించింది. అందులోభాగంగానే వాట్సాప్ ద్వారా సులభంగా ఇసుక బుకింగ్ చేసుకొనేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. జీపీఎస్, డ్రోన్ల ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుక సరఫరా ప్రక్రియను వీక్షించడమే కాకుండా రికార్డుచేసే వీలు కలుగుతుందని వెల్లడించాయి. సాఫ్ట్‌వేర్, డ్రోన్లు, జీపీఎస్ ప్రక్రియను రెండు నెలల్లోగా పూర్తిచేస్తామని టీజీఎండీసీ చైర్మన్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

## జీఆర్‌ఎస్ ఆన్‌లైన్ కోర్సు ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): గ్రామ్ రోజ్‌గార్ సేవక్ (జీఆర్‌ఎస్) ఆన్‌లైన్ కోర్సును కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రారంభించారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్‌ఐఆర్‌డీ)లో మంగళవారం జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ 66వ జనరల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. న్యూఢిల్లీకి చెందిన జేఎన్‌యూ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ), పీహెచ్‌డీకి సంబంధించి రెండు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. రూరల్ టెక్నాలజీ పార్కును సందర్శించి పీఎంఏవై-జీ మోడల్ హౌస్‌ను ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. పార్క్‌లోని మడ్‌బ్లాక్ తయారీ యూనిట్‌ను సందర్శించారు.

# కొత్త కోర్సుల తిరస్కరణ చెల్లదు

- కాలేజీల దరఖాస్తులను పునఃపరిశీలించాలి
- కొత్త కోర్సులపై ప్రభుత్వ విధానమే సరిగ్గా లేదు
- ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల అప్పీళ్లపై హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో వివిధ కోర్సుల్లో సీట్ల పెంపు, కుదింపు, కొత్త కోర్సుల ప్రారంభానికి సంబంధించిన అప్లికేషన్లను మూకుమ్మడిగా తిరస్కరించడానికి వీల్లేదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చి చెప్పింది. కాలేజీలు దాఖలు చేసుకున్న అప్లికేషన్లను ప్రభుత్వం పునఃపరిశీలించి చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకోసం అవసరమైతే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ తేదీలను కూడా సవరించుకోవాలని సూచించింది. కొత్త కోర్సులకు అనుమతినిచ్చే ప్రభుత్వ పాలసీయే సరిగ్గా లేదని వ్యాఖ్యానించింది. కాలేజీ యాజమాన్యాలు దాఖలు చేసుకునే అప్లికేషన్ల తిరస్కరణకు సహేతుక కారణాలు చెప్పాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందిస్తే అన్ని కాలేజీలకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంది. వివక్ష ఉండరాదని, చట్ట నిబంధనలకు అనుగుణంగా అప్లికేషన్ల పరిశీలన-చర్యలు ఉండాలని కూడా తేల్చి చెప్పింది. ఇంజినీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సులకు అనుమతి, సీట్ల పెంపు వంటి అంశాలపై ప్రభుత్వ నిర్ణయమే అంతిమమని ఈ నెల 9న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ ఎన్ రాజేశ్వర్‌రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం రద్దు చేసింది.

### ప్రభుత్వానికి నష్టం లేదు: పిటిషనర్ల వాదన

ప్రైవేటు కాలేజీల తరఫున సీనియర్ న్యాయవాదులు దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, శ్రీరఘురాం, ఎస్ నిరంజన్‌రెడ్డి, పీ శ్రీరాం వాదనలు వినిపిస్తూ.. కంప్యూటర్ కోర్సు దాని అనుబంధ కోర్సుల్లో సీట్ల పెంపు వల్ల ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ లేదని పేర్కొన్నారు. కంప్యూటర్ కోర్సు, దాని అనుబంధ కోర్సుల్లో సీట్లను పెంచుకోవడానికి జేఎన్‌టీయూ ఎన్వోసీ ఇచ్చింది. దీంతో ఏఐసీటీఈ ఆమోదం చెప్పింది. సాంకేతికంగా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి కాబట్టి అప్లికేషన్లు పెట్టుకుంటే రాష్ట్రం తిరస్కరించడం అన్యాయం అని చెప్పారు.

### ప్రమాణాలు పడిపోతాయి: ప్రభుత్వం

ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొత్త అనుమతులు మంజూరు చేయడం వల్ల విద్యాప్రమాణాలు పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎస్సీ కోర్సుల్లో సీట్లు మిగిలిపోయాయని చెప్పారు. ఉన్నత విద్యా ప్రమాణాల పెంపు కోసమే కాలేజీల అప్లికేషన్లను ప్రభుత్వం తిరస్కరించిందని తెలిపారు. కంప్యూటర్ సైన్స్‌లో సీట్ల పెంపు జరిగితే అధ్యాపకుల సమస్య వస్తుందన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ సీట్లను పునరుద్ధరించాలని జూలైలో ఏఐసీటీఈకి జేఎన్టీయూ రిజిస్ట్రార్ లేఖ రాసినట్టు వివరించారు. ఏఐసీటీఈ అనుమతి పరిశీలిస్తే.. ప్రభుత్వ అనుమతి తప్పనిసరనే షరతు ఉందనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు.. షరతులతో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జెఎన్టీయు ఇచ్చిందని, దీని ప్రకారం అనుమతులు కావాలని కోరడం చెల్లదని తెలిపారు.

### పునఃపరిశీలన..

వాదనల తర్వాత హైకోర్టు, సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. కాలేజీల అప్లికేషన్లను ప్రభుత్వం తిరిగి పరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుంటామంటే అందుకు అనుగుణంగా అప్లికేషన్లను ప్రభుత్వానికి పంపుతామని చెప్పింది. ఒకవేళ ప్రభుత్వం అందుకు నిరాకరిస్తే, తామే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని వెల్లడించింది. దీనిపై ఏజీ కల్పించుకుని, అప్లికేషన్లను ప్రభుత్వ పునఃపరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. దీంతో అప్పీళ్లపై విచారణను ముగిసినట్లు ధర్మాసనం ప్రకటించింది.


## నర్బడ జెమ్స్ అండ్ జ్యూయలరీ లిమిటెడ్

**నమోదిత కార్యాలయం: 1వ అంతస్తు, 3-6-307/1, 3-6-307/2, 3-6-308/1, హైదర్‌గూడ మెయిన్ రోడ్, సింపుల్ నేచురల్ సిస్టమ్స్, హైదరాబాద్, తెలంగాణ-500004. ఫోన్: +91-7671848411, ఇమెయిల్: comsec@narbadajewellery.com.**

**30 జూన్ 2024తో ముగిసిన త్రైమాసికానికి స్టాండ్‌అలోన్ ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాల సంగ్రహం**

(రూ.లక్షలలో)

| క్ర. సం. | వివరాలు | 30-06-2024తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్ చేయనివి) | 31-03-2024తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్ చేసినవి) | 30-06-2023తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్ చేయనివి) | సంవత్సరం 31-03-2024 (ఆడిట్ చేసినవి) |
|---|---|---|---|---|---|
| 1 | కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం | 2344.42 | 928.24 | 2336.83 | 8462.07 |
| 2 | కాలానికి నికర లాభం/ (నష్టం) (పన్ను, అసామాన్య మరియు/ లేదా అసాధారణ ఐటమ్‌లకు ముందు) | 340.44 | (303.39) | 340.30 | 688.30 |
| 3 | పన్నుకు ముందు కాలానికి నికర లాభం/ (నష్టం) (అసామాన్య మరియు/ లేదా అసాధారణ ఐటమ్‌ల తరువాత) | 340.44 | (303.39) | 340.30 | 688.30 |
| 4 | పన్నుకు తరువాత కాలానికి నికర లాభం /(నష్టం) (అసామాన్య మరియు/లేదా అసాధారణ ఐటమ్‌ల తరువాత) | 255.75 | (233.53) | 254.65 | 508.48 |
| 5 | కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం [కాలానికి లాభం/ (నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) కలిగినది] | 255.75 | (233.53) | 254.65 | 508.48 |
| 6 | ఈక్విటీ వాటా మూలధనం | 2115.73 | 2115.73 | 2115.73 | 2115.73 |
| 7 | గత సంవత్సరానికి ఆడిట్‌చేసిన బ్యాలన్స్ షీట్‌లో చూపిన విధంగా ఇతర ఈక్విటీ (రివాల్యుయేషన్ రిజర్వు మినహా) | - | - | - | 2845.40 |
| 8 | షేర్‌కు ఎర్నింగ్స్ (కొనసాగుతున్న, నిలిపివేసిన కార్యకలాపాల కొరకు) - బేసిక్ : డైల్యూటెడ్: | 1.21 1.21 | (1.10) (1.10) | 1.20 1.20 | 2.40 2.40 |

గమనిక:

1) ఈ ఆర్థిక ఫలితాలు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 133 క్రింద పేర్కొన్న విధంగా ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (Ind AS) 34 ఇంటీరిమ్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్, సవరించబడిన విధంగా, దాని క్రింద జారీచేసిన సంబంధిత నియమాలతో చదువబడే మరియు భారత దేశంలో సాధారణంగా అంగీకరించే ఇతర అకౌంటింగ్ ప్రిన్సిపల్స్ ప్రకారం తయారు చేయబడినవి. ఈ ఆర్థిక ఫలితాలు SEBI (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని అవశ్యకతలకు అనుగుణంగా మరియు వాటిలోని ప్రకటించు అవశ్యకతలను పాటిస్తూ తయారు చేయబడినవి.

2) కంపెనీ యొక్క చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ IND AS 108, 'ఆపరేటింగ్ సెగ్మెంట్' ద్వారా పేర్కొన్న విధంగా చీఫ్ ఆపరేటింగ్ డెసిషన్ మేకర్ (CODM)గా గుర్తించబడినారు. కంపెనీ ఒక సెగ్మెంట్‌లోనే ఆపరేట్ అవుతున్నది. ఆప్రకారం సెగ్మెంట్ సమాచారం విడిగా తెలుపబడలేదు.

3) పై స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే పరిశీలించబడినవి మరియు సిఫార్సు చేయబడినవి. తరువాత 13.08.2024న నిర్వహించిన వారి సంబంధిత సమావేశాలలో కంపెనీ యొక్క డైరెక్టర్ల బోర్డుచే ఆమోదించబడినవి. స్టాట్యుటరీ ఆడిటర్లు ఆడిట్ నిర్వహించారు మరియు ఆర్థిక ఫలితాలపై మార్పుచేయని అభిప్రాయాన్ని వ్యక్తంచేసారు.

4) సంబంధిత గత సంవత్సరానికి సంఖ్యలు ప్రస్తుత ఫలితాలతో వాటిని పోల్చుటకు అవసరమైనచోట రీ-గ్రూప్ చేయబడినవి/రీ-క్లాసిఫై చేయబడినవి.

డైరెక్టర్ల బోర్డు తరపున

ప్రదేశం: హైదరాబాద్ — సం/- సంజయ్ కుమార్ సంఘి, మేనేజింగ్ డైరెక్టర్

తేది: 13-08-2024 — DIN : 00629693

## ఉదయ్ జ్యూయలరీ ఇండస్ట్రీస్ లిమిటెడ్

**నమోదిత కార్యాలయం: 2వ అంతస్తు, 3-6-307/1, 3-6-307/2, 3-6-308/1, హైదర్‌గూడ మెయిన్ రోడ్, సింపుల్ నేచురల్ సిస్టమ్స్, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ-500 004. వెబ్‌సైట్: www.udayjewellery.com; CIN: L74900TG1999PLC080813**

**30 జూన్ 2024తో ముగిసిన త్రైమాసికానికి స్టాండ్‌అలోన్ ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాల సారాంశము**

(రూ.లక్షలలో)

| క్ర. సం. | వివరాలు | 30-06-2024తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్ చేయనివి) | 30-06-2023తో ముగిసిన త్రైమాసికం (ఆడిట్ చేయనివి) | 31-03-2024 సంవత్సరం (ఆడిట్ చేసినవి) |
|---|---|---|---|---|
| 1 | కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం | 4156.08 | 3460.03 | 17,408.94 |
| 2 | కాలానికి నికర లాభం/(నష్టం) (పన్ను, అసామాన్య మరియు/లేదా అసాధారణ ఐటమ్‌లకు ముందు) | 349.68 | 401.63 | 1,189.19 |
| 3 | పన్నుకు ముందు కాలానికి నికర లాభం/(నష్టం) (అసామాన్య మరియు/లేదా అసాధారణ ఐటమ్‌ల తరువాత) | 349.68 | 401.63 | 1,189.19 |
| 4 | పన్నుకు తరువాత కాలానికి నికర లాభం/(నష్టం) (అసామాన్య మరియు/లేదా అసాధారణ ఐటమ్‌ల తరువాత) | 261.52 | 300.54 | 871.31 |
| 5 | కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం [కాలానికి లాభం/ (నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) కలిగినది] | 261.52 | 300.54 | 871.31 |
| 6 | ఈక్విటీ వాటా మూలధనం | 2202.19 | 2202.19 | 2202.19 |
| 7 | గత సంవత్సరానికి ఆడిట్‌చేసిన బ్యాలన్స్ షీట్‌లో చూపిన విధంగా ఇతర ఈక్విటీ (రివాల్యుయేషన్ రిజర్వు మినహా) | - | - | 5,392.62 |
| 8 | షేర్‌కు ఎర్నింగ్స్ (కొనసాగుతున్న, నిలిపివేసిన కార్యకలాపాల కొరకు) - బేసిక్: డైల్యూటెడ్: | 1.19 1.19 | 1.82 1.82 | 3.96 3.96 |

గమనిక:

1) ఈ ఆర్థిక ఫలితాలు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 133 క్రింద పేర్కొన్న విధంగా ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (Ind AS) 34 ఇంటీరిమ్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్, సవరించబడిన విధంగా, దాని క్రింద జారీచేసిన సంబంధిత నియమాలతో చదువబడే మరియు భారత దేశంలో సాధారణంగా అంగీకరించే ఇతర అకౌంటింగ్ ప్రిన్సిపల్స్ ప్రకారం తయారు చేయబడినవి. ఈ ఆర్థిక ఫలితాలు SEBI (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని అవశ్యకతలకు అనుగుణంగా మరియు వాటిలోని ప్రకటించు అవశ్యకతలను పాటిస్తూ తయారు చేయబడినవి.

2) కంపెనీ యొక్క చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ IND AS 108, 'ఆపరేటింగ్ సెగ్మెంట్' ద్వారా పేర్కొన్న విధంగా చీఫ్ ఆపరేటింగ్ డెసిషన్ మేకర్ (CODM)గా గుర్తించబడినారు. కంపెనీ ఒక సెగ్మెంట్‌లోనే ఆపరేట్ అవుతున్నది. ఆప్రకారం సెగ్మెంట్ సమాచారం విడిగా తెలుపబడలేదు.

3) పై స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే పరిశీలించబడినవి మరియు సిఫార్సు చేయబడినవి. తరువాత 13-08-2024న నిర్వహించిన వారి సంబంధిత సమావేశాలలో కంపెనీ యొక్క డైరెక్టర్ల బోర్డుచే ఆమోదించబడినవి. స్టాట్యుటరీ ఆడిటర్లు ఆడిట్ నిర్వహించారు మరియు ఆర్థిక ఫలితాలపై మార్పుచేయని అభిప్రాయాన్ని వ్యక్తంచేసారు.

4) సంబంధిత గత సంవత్సరానికి సంఖ్యలు ప్రస్తుత ఫలితాలతో వాటిని పోల్చుటకు అవసరమైనచోట రీ-గ్రూప్ చేయబడినవి/ రీ-క్లాసిఫై చేయబడినవి.

డైరెక్టర్ల బోర్డు తరపున

ప్రదేశం: హైదరాబాద్ — సం/- రితేష్ కుమార్ సంఘి, మేనేజింగ్ డైరెక్టర్

తేది: 13-08-2024 — DIN : 00628033